


# మేచింగ్

## కోడూరి శేషఫణి శర్మ

“సుమిత్ర గారూ!” మృదువుగా విని పించిన కంఠధ్వనికి తిరిగి చూ *సింది సుమిత్ర. కుడి భుజం మీదుగా కురులని ముందుకు వేసుకుని దువ్వుకుంటూన్నది కాస్త అలాగే నిలుచుండి పోయింది.


గేట్లో అందంగా అల్లిన బోగిన్ విల్లా ఆర్చి క్రిందుగా లోపలికి రాబోతూ ఉన్నాడు శచీంద్ర.

“నేను సరదాకి పెంచిన గులాబీ మొక్క పూ *సిందండి. ఇదే మొదటి పూవు.” చేతిలో ఉన్న గులాబీని సుతారాంగా అందించాడు.

“చాలా బాగుంది! దేవుడు పటానికి పెట్టక పోయావా? గులాబీలన్నా, గులాబీలతో భగ వంతుని పూజించటమన్నా నాకు చాలా ఇష్టం” అంది సుమిత్ర గులాబీ నందు కుంటూ.

అరచేతి వెడల్పున ఉంది గులాబి. రెండు ఆకులు, మృదువైన కాడ! లలితమైన సౌంద ర్యానికి భావ కవుల నిర్వచనంలా ఉంది. కృష్ణశాస్త్రి గీతంలోలా రేకులు ఒత్తుగా, మత్తు గాలిపేలా సువాసన విరజిమ్ముతున్నా యి.

“మీరు నమ్ముతారో, లేదో కాని ఒక మాట చెప్పనాండి! నా దృష్టిలో ఈ సృష్టికంతటికీ




భగవత్ స్వరూపం కనబడేది స్త్రీ మూర్తిలో నే. అందులోనూ మీరు సు-మిత్ర. ఇష్టమైన వస్తువును భగవంతుని కర్పించినా, ఇష్టమైన మిత్రుల కిచ్చినా ఒకటే. దయచేసి మీ దగ్గరే ఉంచండి!" శచీంద్ర మాటల్లోని భావం అతడి కళ్ళలో ప్రతిఫలించడం గమనించింది సుమిత్ర.

"థేంక్స్!" అంది మృదువుగా.

సంతృప్తిగా వెనుదిరిగి రోడ్డు అవతల వున్న తన గదికి వెళ్ళిపోయాడు శచీంద్ర.

స్త్రీమూర్తివల్ల అతని భావౌన్నత్యాన్ని మనసులోనే అభినందించింది సుమిత్ర.

సమకాలీన సమాజంలో మనుషుల మనస్సులు మలిన సరస్సు లవుతున్న కాలంలో స్త్రీని భగవంతునికి మారు రూపంగా చూచే అతని హృదయ సౌందర్యం ఆమె మనసులో అతని కో ప్రత్యేక స్థానాన్నిచ్చింది.

సుమిత్ర పెళ్ళయి సంవత్సర మైంది. భర్త కృష్ణమోహన్ స్టేటు బాంకిలో ఆఫీసరు. శ్రీనివాస నగర్‌లో ఇప్పుడున్న ఇంట్లో చేరి ఆరు నెల లయింది. ఉన్నది ఇద్దరే అయినా, కాస్త పెద్ద ఇల్లే తీసుకున్నారు.

ముద్దుగా చూడ ముచ్చటగా ఉన్న ఇల్లు! చుట్టూ కాంపౌండు. మనిషెత్తు పెరిగిన కొబ్బరి చెట్లు! సుమిత్ర అభిరుచికి తగినట్లుగా ఉంది. వచ్చిన కొత్తలో రెండు మూడు గులాబీ మొక్కల్ని నాటింది. ఎందుకో అవి అతకలేదు.

ఉదయం లేస్తూనే వడగ్గది కిటికీలోంచి తొంగిచూసే గులాబీని కోసుకోవాలనే కోరిక తీరలేదు సుమిత్రకి.

సుమిత్రా వాళ్ళ ఇంటి ఎదురుగా ఓ గదిలో ఉంటున్నాడు శచీంద్ర. ఈ మధ్యే ఏదో ఆఫీసులో అపాయింట్‌మెంట్ వచ్చింది. గదికి నీటి వసతి లేదు. రోజూ ఉదయమే వచ్చి సుమిత్రా వాళ్ళ ఇంటి నుంచి ఓ బకెట్ నీళ్ళు పట్టు కెళుతూంటాడు. తర్వాతెప్పుడో వచ్చి మిగిలిన నీళ్ళు పట్టి పెడుతుంది పనిపిల్ల.

ఈ ఆరు నెలలలోనూ సుమిత్రా, కృష్ణమోహన్‌లతో మంచి స్నేహం ఏర్పడింది శచీంద్రకు. అతని సభ్యతా సంస్కారాలు స్నేహం మరింత పెరగటానికి దోహదం చేశాయి.

గులాబీని లోపలికి తీసికెళ్ళింది సుమిత్ర. రేకులు త్వరగా రాలిపోకుండా, తాజాగా ఉండాలని ఓ చుక్క కొబ్బరినూనె పూవు మధ్యలో వేసింది. టేబిల్ మీదున్న వేంకటేశ్వరుని ప్రతిమముందు భక్తిగా ఉంచింది. ఆ క్షణంలో ఆమె హృదయం భగవదర్పిత మైనట్లుగా అనుభూతి పొందింది.

"సుమీ! తయారవ్వు! మంచి సినిమాకెళ్దాం!" మల్లెపూల చెండుని ఒళ్ళోకి విసిరి వేస్తూ అన్నాడు కృష్ణమోహన్.

సుమిత్ర కళ్ళలో మెరుపు మెరిసింది. పోయిన ఆట బొమ్మ దొరికించుకున్న పసి పాపలా ఆమె మనసు ఉరకలు వేసింది.

ఏదో మిష చూపి తను రాకుండా స్నేహితురాళ్ళతో సినిమాలకి వెళ్ళమనే కృష్ణమోహన్ ఈ రోజు ఏ కళ నున్నాడో!

చప్పున లేచింది సుమిత్ర. ఒళ్ళో నున్న మల్లె చెండు వేంకటేశ్వరుని ప్రతిమముందు గులాబీ నానుకుని వుంచింది.

ఆ వైపు చూచాడు కృష్ణమోహన్.

"ఎక్కడి దీ గులాబీ?"

"శచీంద్ర ఇచ్చి వెళ్ళాడు" అంది సుమిత్ర, లోపలి గదిలోకి పోతూ.

"చాలా లవ్లీగా ఉంది!" ఓ మారు చేతిలోకి తీసుకుని తిరిగి గులాబీని అక్కడే ఉంచాడు.

× × ×

స్నానం చేసింది సుమిత్ర. శరీరమంతా తాజాదనం నిండింది. కొన్ని సాయంకాలాలు అంతే. అనుకోకుండా ఆనందంగా గడిచి అనుభూతుల్ని మనసు నిండుగా నింపుతాయి.

మధ్యనుంచి మొదలు పెట్టి క్రిందివరకూ జడ అల్లింది. కృష్ణవేణి పాయలా ఉన్న జడని వెనక్కి మడిచి పైకెత్తింది. కుదురులో కుదురుగా రిబ్బన్ ముడివేసింది.

"సుమిత్రా! టైమవుతుంది... కానివ్వు!" బయటి నుంచి హెచ్చరించాడు కృష్ణమోహన్.

"ఇదిగో... అయింది." పౌడర్ అద్దుకుంటూ అంది సుమిత్ర.

చీరకోసం బీరువా తెరిచింది.

లేత నీలి రంగు చీర.

ఊఁహూఁ...

వయొలెట్ కలర్ చీర...

ఊఁహూఁ...

క్రీమ్ కలర్... చీర...

ఊఁహూఁ...

లేత రోజా రంగు చీర...

బాగుంది అనుకుంటూ తీసింది సుమిత్ర. మేచింగ్ జాకెట్‌కోసం వెతకాల్సిన పనిలేదు. ఏ చీరకి మేచ్ అయ్యే జాకెట్ ఆ చీరమడతల్లోనే పెడుతుంది తను.

త్వరత్వరగానే అయినా అందంగా చీర కట్టుకుంది. కుచ్చిళ్ళు తీర్చి దిద్దినట్టుగా అమిరాయి. జాకెట్ ఖచ్చితంగా కొలతల కుంది.

పూలు పెట్టుకోవటానికి విసవిసా టేబిల్ దగ్గరికి నడిచింది.

తెల్లగా నవ్వుతూ మల్లెపూలు!

ముద్దుల పాపాయి చెక్కిలిలా గులాబీ!

ఒకదాన్ని మించిన అందం, సౌకుమార్యం మరొటిది...

ఓ మారు తను కట్టుకున్న చీర వైపు చూసుకుంది సుమిత్ర... గులాపీ రంగు..

గులాపీ నందుకుని ముచ్చటగా ఉన్న ముడిలో ఓ ప్రక్కగా వచ్చేట్లు హెయిర్ పిన్‌తో గుచ్చింది.

"వెళ్దాం...పదండి!" అంది చెప్పులు వేసుకుంటూ.

సుమిత్ర నోమరు పైకీ, క్రిందికీ చూశాడు కృష్ణమోహన్. అతడి కళ్ళలో ఏ భావమూ లేదు. ఆమెతోబాటు బయటికి నాలుగు అడుగులు వేశాడు.

"సుమీ!" అన్నాడు.

వెనుదిరిగి చూసింది సుమిత్ర.

"నా కెందుకో సినిమాకి రావాలనిపించటంలేదు. పక్కింటి పిన్నిగారితో వెళ్ళిరా!" ఇంట్లోకి వెళ్ళి ఈజీఛెయిర్‌లో వాలిపోయాడు కృష్ణమోహన్.

23.5.84

అకస్మాత్తుగా అతనిలో కలిగిన విసుగు, అసహనం సుమిత్రకు ఆశ్చర్యాన్ని కలిగించాయి.

ఆమె ముఖంలో వేయి ప్రశ్నార్థకాలు!

× × ×

"శచీంద్రా! ఈ చీరెకి ఎంబ్రాయిడరీ చేయించు కొస్తావా? ప్లీజ్... ఇదిగో ఈ పేపర్ కటింగ్‌లో ఉన్న డిజైన్ వేయించు. ఈ రోజు సాయంకాలానికే కావాలి..."

"ఏమిటి విశేషం?"

"రేపు నా బర్త్ డే... మన చుట్టూ నాలుగిళ్ళ వాళ్ళనీ పార్టీకి పిలవమన్నారు మావారు. పని తెమల్లేదు. ఆయనకేమో హాఫ్ ఇయర్ ఎండింగ్. పనెక్కువ. ప్లీజ్! చేయించి తీసుకుని రావా?"

"అయితే ఓ షరతు! మీ జన్మదిన కానుకగా ఈ డిజైన్ ఖర్చు నన్ను పెట్టుకోనివ్వండి!"

"ప్రెజెంటేషన్సు కోసం కాదు మేము పార్టీకి పిలవాలనుకుంది..." అంది సుమిత్ర.

మాట్లాడకుండా చీరె పాకెట్ అందుకున్నాడు శచీంద్ర.

సాయంకాలం పార్టీ ముగిసింది. కాస్త నలిగిన మల్లె చెండులా ఉంది సుమిత్ర. లేత ఆకుపచ్చని చీరెపై ముదురు ఆకుపచ్చ రంగులో ఎంబ్రాయిడరీ చేసిన చీరె! పాలరాతి బొమ్మకి చుట్టినట్టు ఉంది.

"మరి వెళ్దామా?"

"ఎక్కడికి?"

"వారం రోజుల్నుంచీ అంటున్నారు-ఈ రోజు వెంకటేశ్వరుని గుడికి వెళ్ళి కొబ్బరికాయ కొట్టి రావాలని- మరచిపోయారా?"

"లేదు..."

"మరి లేవండీ!" గోముగా అంది సుమిత్ర.

చేతిలోని పేపర్ విసిరేశాడు కృష్ణమోహన్. సుమిత్ర నోమారు పైకీ, క్రిందికీ చూశాడు. అతని కళ్ళలో ఏ భావమూ పలకటం లేదు.

"సారీ! నాకు రావాలనిపించటం లేదు" అన్నాడు నిర్లిప్తంగా.

"ఏం?" అయోమయంగా అడిగింది సుమిత్ర.


"రావాలంటే ఎవరినైనా తోడు తీసుకుని వెళ్ళిరా!" అలసిపోయినట్లుగా కళ్ళు మూసుకున్నాడు కృష్ణమోహన్ కుర్చీలో వెనక్కివాలిపోతూ.

"ఎవరితోనో వెళ్ళకపోతే ఏం పోయింది? ఇంట్లోనే దీపం వెలిగించి దేవుడికి నమస్కారం చేస్తేపోదూ!" ప్రొద్దుటినుంచీ ఉన్న ఆసక్తి తుడిచిపెట్టుకుపోగా నిస్పృహను వ్యక్తం చేస్తూ అంది సుమిత్ర.

చీరె మార్చటానికి ఇంట్లోకి వెళ్ళింది.

× × ×

"మళ్ళీ ఎప్పుడొస్తావ్, అనూ! అంతవరకూ




ఎలా గడపమంటావ్?"

ట్రేలో కాఫీ కప్పులు తీసుకువెళుతూన్న సుమిత్ర ఆగింది! గదిలోంచి వినిపిస్తూన్న మాటలు ఆమె చెవిన పడ్డాయి. కిటికీలోంచి చూసింది.

"సుమిత్ర నీకు సరైన మేచ్ కాదు, కృష్ణా!" అనసూయ అంటూ ఉంది.

కృష్ణమోహన్ భుజం మీద తల ఆన్చి ఉందామె. ఆమె వీపు నిమురుతూ ఉన్నాడు కృష్ణమోహన్.

సుమిత్రకు వెన్నెముకలో విషం ప్రాకినట్లయింది. దట్టమయిన చీకట్లో వెలుగు రేఖని కబళించి వేస్తున్నట్లనిపించింది.

కృష్ణమోహన్ ఇలాంటి వాడా?

అనసూయ ఇలాంటిదా?

తన క్లాస్‌మేట్ అనీ, ఆఫీసు పనిమీద ఈ ఊరొచ్చిందనీ భర్త చెబితే తను ఎంత గుడ్డిగా నమ్మింది? భర్తకి స్నేహితురాలంటే తనకూ అంతేనని ఆదరించింది.

ఇదా ప్రతిఫలం? ఇదా వీళ్ళిద్దరి మధ్య ఉన్న స్నేహం?

ఆమె కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. గిరుక్కున వెనుదిరిగి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

× × ×

సుమిత్రకోసం ఇల్లంతా వెతికాడు కృష్ణమోహన్. కనిపించలేదు. ముందు గదిలో వేంకటేశ్వరుని ప్రతిమ క్రింద ఓ ఉత్తరం కనిపించింది.

"...మిమ్మల్ని ఏమని సంభోధించటానికీ మన సొప్పడం లేదు. మీ అసలు స్వరూపం, అసలు రంగు నాకు అర్థమయింది.

మన ఇద్దరికీ స్నేహితుడూ, ఆత్మీయుడూ అయిన ఓ సహృదయుడి నుంచి తీసుకున్న గులాబీని చీరె రంగుకి మేచ్ అయిందని సరదాగా జడలో తురుముకుంటే మీకు విసుగూ... అసహనం...

అవసరానికి తీరికలేకపోతే, ఆ వ్యక్తే ఎంబ్రాయిడరీ చేయించు కొచ్చిన చీరె కట్టుకుంటే మీకు బాధ...ఆవేదన...

ఆ రెండు రాత్రులూ మీరు నాకు చూపిన నరకం నేను మరచిపోలేను.

మరి మీ సంగతి? మీరు అసూయాపరులు మాత్రమే కారనీ, 'అసూయాపరులనీ', నేను మీకు తగిన మేచ్‌ని కాదంటూ ఆవిడచేసే కామెంటు వింటూ ఆమె పరిష్వంగంలో పరవశించి పోతున్నారనీ కళ్ళారా చూసినప్పుడు నా కెలా ఉంటుంది?

ఈ రోజు అనసూయ నా కళ్ళు తెరిపించింది. చీరె రంగుకి మేచ్ అయేలా జడపూలనీ, ఎంబ్రాయిడరీ డిజైనునూ సెలెక్ట్ చేసుకో గలిగాను. జీవిత భాగస్వామి మేచ్ కావడంలేదు. ఇప్పటి పరిస్థితులలో ఇద్దరికీ ఇద్దరం మేచ్ కాము. మీ రంగు మారిందని నమ్మకం కుదిరిన తర్వాతే మళ్ళీ రావడం... అంతవరకూ నా కొరకు మా నాన్న గారి ఇంటికి రావద్దు...

-సుమిత్ర"

అనుకోని సంఘటనకి ప్రతిమలా నిలుచుండిపోయాడు కృష్ణమోహన్. ●